క్లుప్తంగా

హిందూ ధర్మాన్ని కాపాడుకుందాం

కుక్కునూరు: సనాతన హిందూ ధర్మాన్ని పరిరక్షించుకోవడానికి ప్రతిఒక్కరూ ప్రతినబూనాలని భజరంగ్‌దళ్ జిల్లా సంయోజక్ బొంతు నాగరాజు పిలుపునిచ్చారు. కుక్కునూరు చేరుకున్న శార్య జాగరణ యాత్రలో నాగరాజు మాట్లాడారు. హిందూ ధర్మ సంస్కృతి, సాంప్రదాయాలు, మందిరాలు, ధార్మిక గ్రంథాలను పరిరక్షించుకోవడానికి యువత కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు మోటార్‌సైకిల్ ర్యాలీ నిర్వహించారు. తోట రామకృష్ణ, వేదుల జనార్దనరావు, భజరంగ్‌దళ్, వీహెచ్‌పీ నాయకులు పాల్గొన్నారు.

విజిలెన్స్ తనిఖీలు

జంగారెడ్డిగూడెం: పట్టణంలో ఒక రేషన్ షాపు, రెండు ఎండీయూ వాహనాలను విజిలెన్స్, రెవెన్యూ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో 4వ నెంబర్ రేషన్‌షాపులో 54 ప్యాకెట్లు, గోధుమ పిండి 14 ప్యాకెట్లు నిల్వలలో తేడా గుర్తించినట్లు అధికారులు తెలిపారు. దీనిపై డీలర్ కొత్తూరి నాగేశ్వరరావుపై కేసు నమోదు చేశారు. అలాగే ఎండీయూ వాహనం 22లో గోధుమపిండి 13 ప్యాకెట్లు, పంచదార 41 ప్యాకెట్లు, ఎండీయూ వాహనం 17లో గోధుమపిండి, పంచదార నిల్వలు తేడా గుర్తించామన్నారు. వాహన నిర్వాహకులు ఎన్.శేషుకుమార్, ఎ.ఆదినారాయణలపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ ఎస్సై రంజిత్ కుమార్, ఏవో శ్రీనివాస్, డీటీ వై.లక్ష్మీకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



నిర్వాసితుల సమస్యలు తెలుసుకుంటున్న దృశ్యం

బుట్టాయగూడెం: ఆర్అండ్ఆర్ కాలనీ నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని కొవ్వూరు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గీతాంజలి అన్నారు. దొరమామిడి సమీపంలోని నిర్మించిన నిర్వాసిత గ్రామం సరుగుడులో ఆమె మంగళవారం పర్యటించారు. గ్రామంలోని సమస్యలపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని గీతాంజలి చెప్పారు. సర్పంచ్ తెల్లం రాముడు, కార్యదర్శి బుజ్జమ్మ నిర్వాసిత గ్రామపెద్దలు, మహిళా పోలీసు ఎస్‌కే రాజీనా పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థినులు



బేస్‌బాల్ పోటీలకు ఎంపికైన పుష్పకుమారి



సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైన టి.లక్ష్మి

కొయ్యలగూడెం: జంగారెడ్డిగూడెం అంబేద్కర్ గురుకుల పాఠశాలలో నిర్వహించిన పోటీల్లో తమ విద్యా సంస్థలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు వెంకటపతి రాజు విద్యాసంస్థల చైర్‌పర్సన్ ఎస్ఆర్ఆర్ సుభద్రదేవి మంగళవారం పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి అండర్ –19 బేస్‌బాల్ పోటిలకు ఎం.పుష్పకుమారి, సాఫ్ట్‌బాల్ పోటీలకు టి.లక్ష్మి ఎంపికయ్యారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను మాజీ సర్పంచ్ నరసింహారాజు, ప్రిన్సిపాల్ నారా కేశవరావు అభినందించారు.

ఉపాధ్యాయుడు నాగరాజుకు సహస్ర కవిరత్న బిరుదు



పోరంకి నాగరాజు

కామవరపుకోట: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందూ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న పోరంకి నాగరాజుకు సహస్ర కవి రత్న బిరుదు వరించింది. హైదరాబాదు పంచపది కవన వేదిక, నిర్వాహకులు పంచపది రూపకర్త కాటీ, పాండురంగ విఠల్ మంగళవారం బిరుదును, ప్రశంసాపత్రాన్ని ఆన్‌లైన్ ద్వారా అందజేసినట్లు నాగరాజు తెలిపారు. తెలుగు, హిందీ భాషల్లో బాల సాహిత్యానికి ఉపయోగపడే విధంగా సహస్ర పంచపదులుగాను తనకు ఈ బిరుదును అందించారన్నారు.

నాగేశ్వరరావుకు గౌరవ డాక్టరేట్



గౌరవ డాక్టరేట్‌ను స్వీకరిస్తున్న నాగేశ్వరరావు

టి.నరసాపురం: మండలంలోని ఏపుగుంట గ్రామానికి చెందిన అభ్యుదయ రచయిత, సినీ, నాటక దర్శకుడు వేల్పుల నాగేశ్వరరావుకు గౌరవ డాక్టరేట్ లభించింది. గుంటూరుకు చెందిన సాహిత్య సాంస్కృతిక సామాజిక సేవా సంస్థ పద్మశ్రీ గుర్రం జాషువా స్మారక కళాశాల పరిషత్ గౌరవ డాక్టరేట్‌ను ఇటీవల విజయవాడలో జరిగిన కార్యక్రమంలో నాగేశ్వరరావుకు ప్రదానం చేసింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ భాషా సాంస్కృతిక శాఖ నిర్వహించిన పోటీల్లో నాగేశ్వరరావు రచించిన ది లీడర్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రచనల విభాగంలో ప్రథమ స్థానం పొంది శ్రీశ్రీఅవార్డు సొంతం చేసుకోవడమే కాకుండా రాయలసీమ యూనివర్సిటీ ఎంఏ తెలుగు ఫైనల్ ఇయర్‌లో ఆ రచనను పాఠ్యాంశంగా చేర్చింది. నాగేశ్వరరావును వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఎస్‌వీపీకేహెచ్ శ్రీబురాజు, సర్పంచ్ శ్రీదేవి యర్రంరాజు అభినందించారు.

ప్రజల ఆరోగ్య పరిరక్షణే జగన్ లక్ష్యం



జంగారెడ్డిగూడెం రూరల్: గురవాయిగూడెంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎలీజా



కామవరపుకోట: తడికలపూడిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొన్న జెడ్పీటీసీ రమేష్ తదితరులు



పోలవరం రూరల్: గూటాలలో ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో సూర్యతేజ

జంగారెడ్డిగూడెం రూరల్: ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. మండలంలోని గురవాయిగూడెంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని మంగళవారం ఎమ్మెల్యే ఎలీజా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా రాష్ట్రమంతటా ప్రతి సచివాలయంలో ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తూ ప్రతి ఒక్కరికీ వైద్యసేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఇంటింటికీ వెళ్లి వైద్య పరీక్షలు చేసే కార్యక్రమం ఇప్పటివరకు దేశంలోని ఏ రాష్ట్రంలోనూ చేపట్టలేదని ఎమ్మెల్యే ఎలీజా అన్నారు. వైద్య పరీక్షల అనంతరం ప్రతి సచివాలయం పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమ శిబిరాలను ఏర్పాటు చేసి నిపుణులైన వైద్య బృందాన్ని అందుబాటులో ఉంచి వైద్య సేవలను అందించి ఉచితంగా మందులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గుబ్బల సత్యవేణి, ఎంపీపీ కొదమ జ్యోతి, జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, ఎంపీటీసీ కొయ్య రమారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు వామిశెట్టి హరిబాబు, సచివాలయాల మండల కన్వీనర్ గురజాల పార్థసారథి, వైఎస్సార్‌సీపీ నాయకులు వేముల బాలగురవయ్య, కొయ్య లీలాధరరెడ్డి, దల్లి రామాంజనేయరెడ్డి, తహసీల్దార్ స్లీవ జోజి తదితరులు పాల్గొన్నారు.

తడికలపూడిలో జగనన్న ఆరోగ్య సురక్ష

కామవరపుకోట: తడికలపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్. సునీల్ వర్మ ఆధ్వర్యంలో ఆరోగ్య సిబ్బంది గ్రామస్తులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఎంపీపీ మేడవరపు విజయలక్ష్మి, జెడ్పీటీసీ కడిమి రమేష్ పాల్గొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కొత్తపల్లి రజని శ్రీనివాస్, మండల ప్రత్యేక అధికారి రాజు, తహసీల్దార్ డీవీ సత్యనారాయణ, మండల రెండవ విద్యాశాఖ అధికారి చిన్నం ప్రశాంత్ కుమార్, ఉప సర్పంచ్ కోలా విష్ణు, ఎంపీటీసీలు గంగుల కడియాలు, కొప్పర్తి లక్ష్మి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలి

వేలేరుపాడు: ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని జంగారెడ్డిగూడెం ఆర్డీఓ ఝాన్సి పేర్కొన్నారు. మంగళవారం వేలేరుపాడు మండలంలోని బోళ్ళపల్లి గ్రామంలో కట్కూరు సర్పంచ్ లక్ష్మణ్ అధ్యక్షతన జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆర్డీవో పాల్గొని ప్రసంగించారు. ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రతి నిరుపేదకు ఉచిత వైద్యం అందుతోందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. వేలేరుపాడు డిప్యూటీ తహసీల్దార్ రమేష్, ఆర్ఐ దుర్గారావు, ఎంపీడీఓ మూర్తి, వేలేరుపాడు, కొయిదా వైద్యాధికారులు ఆకిబ్ షరీఫ్, మాధురి, గైనకాలజీ స్పెషలిస్ట్ దీదీపాటియా, జనరల్ సర్జన్ నిఖిలేష్, జెడ్పీటీసీ గుజ్జారామలక్ష్మి, ఎంపీపీ వాళ్ళ లక్ష్మీదేవి, మండల వైఎస్సార్ సీపీ నాయకులు కామినేని వెంకటేశ్వరరావు, మండల సచివాలయ కన్వీనర్ కొలూరి సత్తిరాజు, కుంజా బొజ్జి, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

బోడిగూడెంలో ఆరోగ్య సురక్షకు విశేష స్పందన

కొయ్యలగూడెం: బోడిగూడెం పంచాయతీ పరిధిలో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి విశేష స్పందన లభించింది. కొయ్యలగూడెం, బయ్యన్నగూడెం పీహెచ్‌సీల వైద్యాధికారులు విజయకృష్ణ, తస్లీమాల నేతృత్వంలో నలుగురు డాక్టర్లు 302 మంది రోగులకు వైద్య సేవలందించారు. ఇందులో ఏడుగురికి మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం జంగారెడ్డిగూడెం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రులకు రిఫర్ చేశారు. బోడిగూడెం, అంకాలగూడెం, బర్కెట్ నగర్ గ్రామాల ప్రజలు వైద్య సేవలు పొందారు. బుధవారం పొంగుటూరులో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నారు.

ఆరోగ్యాంధ్రప్రదేశ్ లక్ష్యంగా..

చింతలపూడి: ఆరోగ్యాంధ్రప్రదేశ్ లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టారని సర్పంచ్ కందుల లక్ష్మీ ప్రసన్న అన్నారు. మండలంలోని పోతునూరు, మల్లాయగూడెం సచివాలయ పరిధిలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. పలువురు వైద్యులు గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. తహసీల్దార్ కృష్ణ జ్యోతి వైద్య శిబిరాన్ని పరిశీలించారు. మల్లాయగూడెం సర్పంచ్ చీకటి కవిత, పోతునూరు సొసైటీ అధ్యక్షుడు కె గోవర్ధనరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, సత్యన్నారాయణరెడ్డి, వెంకట్‌రెడ్డి, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

565 మందికి వైద్య పరీక్షలు

పోలవరం రూరల్: ప్రతి ఒక్కరికీ వైద్యసేవలు చేరువలోకి తీసుకువచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి అన్నారు. పోలవరం మండలం గూటాల గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో మెగా వైద్యశిబిరం నిర్వహించారు. ఈ వైద్యశిబిరంలో 565 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరాన్ని ఐటీడీఏ పీవో సూర్యతేజ సమీక్షించి వైద్యాధికారులకు పలు సూచనలు చేశారు. అనారోగ్యంతో ఉండి వైద్యశిబిరానికి వచ్చిన ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్యసహాయం అందించాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కలుం హేమకుమారి, తహసీల్దార్ బి.సుమతి, ఎంపీడీవో జి.శ్రీను, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బుగ్గా మురళీకృష్ణ, ఎంపీటీసీ దెగపాటి హరిరామకృష్ణ, సొసైటీ అధ్యక్షుడు సుంకర అంజిబాబు, వైద్యాధికారులు ఎన్.నిఖిల్, కె.వాసు, పి.రేణుక, ఎంపీ సతీష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

341 మందికి వైద్య సేవలు

టి.నరసాపురం: టి.నరసాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, కేతవరం వైఎస్ఆర్ విలేజ్ క్లినిక్ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. డీఎల్‌పీవో ఎండీ రజావుల్లా, ఎంపీపీ దారబోయిన లక్ష్మి ఈ శిబిరాన్ని పరిశీలించారు. ప్రజలకు డెంగీ, మలేరియా, బీపీ, షుగర్ వంటి 9 రకాల రక్త పరీక్షలు నిర్వహించి 150 రకాల మందులు ఉచితంగా పంపిణీ చేశారు. 341 మంది గ్రామస్తులు వైద్య సేవలను వినియోగించుకున్నారు. ముఖ్యంగా ఎముకల, చిన్నపిల్లల విభాగమునకు చెందినటువంటి స్పెషలిస్ట్ డాక్టర్లు ప్రత్యేక వైద్య సేవలు అందించారు. కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కళ్లజోళ్లు, ఉచితమైన ఆపరేషన్ల నిమిత్తం రిఫర్ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ తడికలపూడి శివ మాధవి కిషోర్, ఎంపీడీవో మంగా కుమారి, ఎంపీటీసీ బొడ్డపాటి రాంబాబు, మండల వైద్యాధికారులు ఫణీంద్ర బాబు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షతో మెరుగైన వైద్యం



కుక్కునూరు: వైద్య శిబిరానికి రోగిని వీల్‌ఛైర్‌లో తీసుకొస్తున్న దృశ్యం

కుక్కునూరు: అనారోగ్యంతో బాధపడేవారిని గుర్తించి మెరుగైన వైద్యాన్ని అందించడమే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమ లక్ష్యమని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కుచ్చర్లపాటి నరసింహరాజు పేర్కొన్నారు. మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం మాధవరం పంచాయతీ, చిరవెల్లి గ్రామంలో జరిగింది. ఈ శిబిరంలో బీపీ, హెచ్‌బీ, ఆర్బీఎస్, మూత్ర, డెంగీ, మలేరియా, ఉమ్మి పరీక్షలు నిర్వహించారు. ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంపీటీసీ కుండా సూర్యనారాయణ, సర్పంచ్ సత్యనారాయణ, చేకూరి నవీన్, గంజి రాజేష్, సెక్రటరీ మోహన్, ఆర్ఐ లావణ్య తదితరులు పాల్గొన్నారు.



కొయ్యలగూడెం: బోడిగూడెంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో వైద్యం చేయించుకునేందుకు వచ్చిన ప్రజలు



చింతలపూడి: పోతునూరు, మల్లాయగూడెం సచివాలయ పరిధిలో ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం



టి.నరసాపురం: ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎల్‌పీవో ఎండీ రజావుల్లా



వేలేరుపాడు : బోళ్ళపల్లిలో ఆరోగ్య సురక్ష శిబిరంలో మాట్లాడుతున్న ఆర్డీఓ ఝాన్సి

బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలి



పొంగుటూరు పంచాయతీ హైస్కూల్‌లో బాలికలకు అవగాహన కల్పిస్తున్న స్నేహన్

కొయ్యలగూడెం: యుక్త వయస్సు బాలికలు రక్తహీనత బారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలని ఏలూరు జిల్లా సచివాలయాల శాఖ సామాజిక ప్రవర్తన మార్పు సమాచార విభాగం జిల్లా సమన్వయకర్త టీఎస్ స్నేహన్ పేర్కొన్నారు. మంగళవారం పొంగుటూరు, కన్నాయగూడెం ప్రభుత్వ పాఠశాలలలో ఆయన పర్యటించారు. పొంగుటూరు జిల్లా పరిషత్ హైస్కూలులో బాలికలకు రక్తహీనత నిర్మూలన– బాల్య వివాహాల నిరోధం అనే అంశంపై బాలలకు అవగాన కల్పించారు. 18 ఏళ్ల లోపు బాలికలకు, 21 ఏళ్ల లోపు బాలురకు వివాహం చేయరాదని చట్టంలోని సెక్షన్-2 స్పష్టం చేస్తుందన్నారు. బాలికల ఆరోగ్యానికి గొడ్డలి పెట్టుగా మారిన రక్తహీనత రాకుండా ఉండాలంటే పౌష్టికాహారాన్ని శ్రద్ధగా తీసుకోవాలన్నారు. రక్తహీనత ఉన్న బాలలపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని అన్నారు. హైస్కూలులో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. బాలల రక్త పరీక్షల వివరాలకు కోసం ప్రత్యేక రికార్డు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారని అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు సందర్శించి అంగన్‌వాడీ కేంద్రాల సిబ్బందితో సమావేశం నిర్వహించారు. హిమోగ్లోబిన్ పరీక్షల వివరాలు అంగన్‌వాడీ కేంద్రాల్లో అందుబాటులో ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ఎన్.రామరాజు, పొంగుటూరు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ, కన్నాయగూడెం స్కూలు ప్రధానోపాధ్యాయురాలు బుల్లమ్మ, ఏఎన్ఎం మధులత, మహిళా పోలీసు దుర్గ, పాఠశాల ఉపాధ్యాయులు అలెగ్జాండర్, డేవిడ్ రాజు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలే లక్ష్యం



జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొన్న వారికి చేతుల్లో శానిటేషన్ వేస్తున్న క్లాప్‌మిత్రాలు

బుట్టాయగూడెం: పేదలకు మెరుగైన వైద్య సేవలందించడమే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంపీపీ కారం శాంతి అన్నారు. మండలంలోని ఇప్పలపాడు సచివాలయం పరిధిలో ఐటీఐ కళాశాల వద్ద మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ శిబిరంలో ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతిఒక్కరికీ క్లాప్ మిత్రాలు శానిటేషన్ చేసి, అందరినీ మాస్క్ ధరించాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ తెల్లం వెంకాయమ్మ, వైస్ ఎంపీపీలు కుక్కల వరలక్ష్మి, గగ్గులోతు మోహన్ రావు, పార్టీ నాయకులు ఆరేటి సత్యనారాయణ, తహసీల్దార్ ఎస్.శారాశాంతి, ఎంపీడీఓ వేణు గోపాలరెడ్డి, ఈవోపీఆర్డీ ఎం.శ్రీహరి కార్యదర్శి జె.కిరణ్, సర్పంచ్‌లు సరియం లక్ష్మి, మడకం రామలక్ష్మి, తెల్లం జయమ్మ, జోడే సత్యదుర్గప్రసాద్, కుంజా వెంకటేశ్వరరావు, సరియం చల్లయ్య, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని సెయింట్ జాన్సన్ హైస్కూల్‌లో బుధవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ పట్టణాధ్యక్షుడు చిటికెల అచ్యుత రామయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మితో కలిసి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా ప్రారంభిస్తారన్నారు. 1 నుంచి 6 సచివాలయం పరిధిలోని ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్య పరీక్షల నిమిత్తం టోకెన్‌లు జారీచేయడం జరిగిందని, టోకెన్లు తీసుకున్న వారితో పాటు టోకెన్లు లేనివారు సైతం వైద్య పరీక్షలు చేయించుకోవచ్చని మున్సిపల్ కమిషనర్ పి.భవానీప్రసాద్ తెలిపారు. దీర్ఘకాలిక వ్యాధుల సమస్యలు ఉన్నవారు సైతం ఉచితంగా పరీక్షలు చేయించుకుని మందులు ఉచితంగా పొందాలని కోరారు.

నేడు బుట్టాయగూడెంలో జగనన్నకు చెబుదాం

బుట్టాయగూడెం: స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద బుధవారం ఉదయం 10 గంటలకు జిల్లా కలెక్టర్ వై.ప్రసన్న వెంకటేష్ ఆధ్వర్యంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించనున్నారు. ఆర్డీఓ ఎం.ఝాన్సీరాణీ, తహసీల్దార్ ఎస్.శారాశాంతి, డీఎల్‌పీఓ రజాఉల్లా, ఎంపీడీవో వేణు గోపాలరెడ్డి ఇతర అధికారులు ఈ కార్యక్రమ నిర్వహణకు ఏర్పాట్లు చేశారు.

వైఎస్సార్ పింఛన్ కానుక అందజేత



తలసేమియా బాధితురాలికి రూ.10 వేల పింఛన్ అందజేస్తున్న సర్పంచ్

కొయ్యలగూడెం: వైఎస్సార్ పింఛన్ కానుక ద్వారా తన జీవితం కుదుటపడుతుంది అని మానుకొండ జ్యోతి అనే మహిళ మంగళవారం సంతోషం వ్యక్తం చేసింది. దిప్పకాయలపాడు గ్రామానికి చెందిన జ్యోతి తలసేమియా వ్యాధితో బాధపడుతుండగా ఆమెకు వైఎస్సార్ పెన్షన్ కానుక ద్వారా ఇక నుంచి పదివేల రూపాయలు అందనుండడంతో ఆనందం వ్యక్తం చేసింది. మొదటి దశ పెన్షన్‌ను సర్పంచ్ సున్నం శాంతకుమారి చేతుల మీదుగా అందజేశారు. పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఏఎస్‌డబ్ల్యూఓ సంకురయ్య, సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్ ఎస్.వరలక్ష్మి, గ్రామ కార్యదర్శి వి.రాజ్‌కుమార్, వలంటీర్ సౌజన్య వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి ఆగమ పాఠశాలకు రూ.3 లక్షల విరాళం

ద్వారకాతిరుమల: మండలంలోని తిమ్మాపురం పంచాయతీ లక్ష్మీపురంలో శ్రీవారి దేవస్థానం నిర్వహిస్తున్న ఆగమ పాఠశాలకు ముగ్గురు భక్తులు మంగళవారం విడివిడిగా రూ.3 లక్షలను విరాళంగా అందజేశారు. విజయవాడకు చెందిన శ్రీ సిద్ధార్థ కన్‌స్ట్రక్షన్ వారు రూ.లక్ష, కార్తికేయ డెవలపర్ అండ్ ప్రమోటర్స్ వారు రూ.లక్ష, శ్రీ కార్తికేయ కన్‌స్ట్రక్షన్ వారు మరో రూ.లక్ష విరాళంగా ఆలయ కార్యాలయంలో జమ చేశారు. ఈ సందర్భంగా దాతలకు ఆలయ అధికారులు విరాళం బాండ్ పత్రాలను అందించి స్వామివారి ప్రత్యేక దర్శన సౌకర్యాన్ని కల్పించారు.

లఖింపూర్‌ఖేర్ ఘటనపై కార్మికుల నిరసనలు



చింతలపూడిలో ఫైర్‌స్టేషన్ వద్ద కార్మిక సంఘాల నిరసన

చింతలపూడి: అఖిల భారత రైతు, కార్మిక సంఘాల సమన్వయ కమిటీ దేశవ్యాప్త పిలుపులో భాగంగా మంగళవారం చింతలపూడిలో రైతు సంఘాల ఐక్య కార్యచరణ కార్మిక సంఘాలు నిరసన కార్యక్రమం నిర్వహించారు. తొలుత ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి ఫైర్ స్టేషన్ సెంటర్ వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం ఫైర్ స్టేషన్ వద్ద ఏపీ రైతు సంఘం మండల కార్యదర్శి దొంత కృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి డి.రంగనాథ్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్‌వీ సత్యనారాయణ, ఏపీ రైతు సంఘం మండల అధ్యక్షుడు ఎస్‌కే కాలేషా, ఏఐటీయూసీ జిల్లా కో-కన్వీనర్ తొర్లపాటి బాబు పాల్గొని మాట్లాడారు. ఉత్తరప్రదేశ్‌లో రైతుల ఉద్యమానికి మద్దతుగా నిర్వహించిన శాంతియుత ర్యాలీలో, రైతులపైకి కారుతో దూసుకువెళ్లి నలుగురు రైతులను కిరాతకంగా హత్య చేసిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి అజయ్ మిశ్రా కుమారుడు ఆశిష్ మిశ్రాపై చట్టపరమైన చర్యలు చేపట్టి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కేంద్ర మంత్రి అజయ్ మిశ్రాను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలన్నారు. స్వామినాథన్ కమిషన్ సిఫారసులు అమలు చేసి పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని డిమాండ్‌చేశారు. తొలుత ఇటీవల మృతిచెందిన ఎంఎస్ స్వామినాథన్ మృతికి రెండు నిమిషాలు మౌనం పాటించారు.

కుక్కునూరు: ఉత్తరప్రదేశ్‌లోని లఖింపూర్‌ఖేర్ ఘటనకు నిరసనగా మంగళవారం కేంద్ర కార్మిక సంఘాల సమన్వయ కమిటీ పిలుపు మేరకు కుక్కునూరులో రైతు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో బ్లాక్‌డే నిర్వహించారు. రైతు వ్యవసాయ, ఏఐటీయూసీ, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు మైసాక్షి వెంకటాచారి, ఏఐటీయూసీ నాయకులు కొన్నె లక్ష్మయ్య, సంయుక్త కిసాన్ మోర్చా డివిజన్ నాయకులు షేక్ గౌస్ మాట్లాడుతూ లఖింపూర్ ఖేరీ హత్యాకాండకు కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని, అజయ్ మిశ్రాను కేంద్ర మంత్రి పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.

ఎస్సీ, ఎస్టీ కేసులపై తక్షణమే కేసు నమోదు



ఎస్పీకి మేరీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న రవికుమార్

కామవరపుకోట: ఎస్సీ ఎస్టీ కేసులపై తక్షణమే కేసు నమోదు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ డి.మేరీ ప్రశాంతి తెలియజేశారని జిల్లా ఎస్సీ, ఎస్టీ కేసుల విజిలెన్స్, మానిటరింగ్ సభ్యులు గుర్రాల రవికుమార్ తెలిపారు. మంగళవారం జిల్లా పోలీస్ ప్రాంగణంలో ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ కేసుల కోసం ప్రత్యేక పోలీస్ స్టేషన్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని త్వరలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగే సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుందామని ఎస్పీ తెలియజేసినట్లు గుర్రాల రవికుమార్ తెలిపారు.

ఆళ్ల నానిని కలిసిన కొఠారి



ఏలూరులో ఆళ్లనానికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కొఠారి మోహన్

లింగపాలెం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు, ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నానిని పార్టీ లింగపాలెం మండల అధ్యక్షుడు కొఠారి మోహన్ మంగళవారం కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువా కప్పి సత్కరించారు. తనకు బాధ్యతలు అప్పగించిన నానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. పార్టీని మరింత అభివృద్ధి పథంలో నడిపించాలని నాని, మోహన్‌కు సూచించారు. తోచలకరాయుడుపాలెం ఉపసర్పంచ్ బేతిన మదు తదితరులు ఉన్నారు.